సాక్షి కర్నూలు

శనివారం। 4। నవంబర్। 2023



ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం నుంచి 8వ తేదీ వరకు ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.



ప్రశాంతంగా 'సీస్'

జాతీయ సాధన పరీక్ష (సీస్) శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఈ పరీక్ష నిర్వహించింది. జిల్లాలో 31,012 మంది విద్యార్థులు పరీక్షను రాశారు.

IIలో▸



కృష్ణాతీరం పరిశీలన

కొత్తపల్లి: ఐకాన్ వంతెన ఏర్పాటుకు ఏపీ ఫైర్ డిపార్ట్‌మెంట్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ శుక్రవారం కృష్ణాతీరాన్ని పరిశీలించారు. బోటులో ఆయన కృష్ణా నదిలో ప్రయాణించారు.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓగా నాగార్జునరెడ్డి

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓగా నాగార్జునరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ జిల్లా అటవీ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.శివశంకర్‌రెడ్డి వ్యక్తి గత కారణాలతో 15 రోజులు సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో వైఎస్సార్ జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓ నాగార్జున రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన డీఎఫ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు.

డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే పరీక్షలు



అల్ట్రాసౌండ్ స్కానింగ్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వైద్య పరీక్షలన్నీ కొత్తగా నిర్మించిన డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. శుక్రవారం డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త బ్లాక్‌లో 6 కొత్త బీపీఎల్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 150 మందికి స్కానింగ్ చేసినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం ప్రారంభించిన సీటీ స్కాన్ మిషన్‌లో మొదటిరోజు 64 మందికి స్కానింగ్ నిర్వహించామన్నారు. మరో వారంలోపు అన్ని రకాల పరీక్షలు ఇక్కడే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, రేడియాలజి హెచ్‌వోడి డాక్టర్ రాధారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరనాథ్, వైద్యులు పాల్గొన్నారు.

నలుగురికి 'కారుణ్య' ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన వారితో జెడ్పీ చైర్మన్

కర్నూలు (అర్బన్): పంచాయతీరాజ్ పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తూ నలుగురు ఉద్యోగులు మృతి చెందగా, ఒక్కో కుటుంబం నుంచి ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇచ్చినట్లు జిల్లాపరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆదేశాల మేరకు మృతిచెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యుల అర్హతలను పరిశీలించి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం సాయంత్రం ఉద్యోగాలు పొందిన వారికి పోస్టింగ్ ఆర్డర్లను జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి అందించారు. జి.రాజారవికిరణ్‌కు కృష్ణగిరి ఎంపీపీ కార్యాలయంలో, వై.మహమ్మద్ అరాఫత్‌కు నంద్యాల ఎంపీపీ కార్యాలయంలో, వై.సాయిసింధూరకు వడ్డెమాను జెడ్పీ హైస్కూల్‌లో, ఎం.జ్యోతికి కౌతాళం మండలం నదిచాగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చినట్లు సీఈఓ తెలిపారు.

'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్ష ఫీజు 30లోగా చెల్లించాలి

కర్నూలు కల్చరల్: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం పదోతరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజును ఈనెల 30వ తేదీలోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి థియరీ ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్ థియరీ ఒక సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ ఒక సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలని పేర్కొన్నారు. ఇంతకు పూర్వం విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది పరీక్షకు హాజరై ఫెయిల్ అయినవారు, పూర్వం విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది ఇంత వరకు పరీక్షకు హాజరు కాని వారు ఫీజు చెల్లించుటకు అర్హులని పేర్కొన్నారు. పరీక్ష ఫీజును ఏపీటీ ఆన్‌లైన్ ద్వారా / పేమెంట్ గేట్ వే ద్వారా ఏపీ ఆన్‌లైన్/ మీసేవా కేంద్రాల ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు. దివ్యాంగులకు పరీక్ష ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్‌యూలో బీఏ ఆనర్స్

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పాసైన విద్యార్థుల కోసం బీఏ ఆనర్స్(ఎకానమిక్స్), బీఏ ఆనర్స్(కామర్స్) కోర్సులను ప్రారంభిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందరానంద పుచ్చ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో ఒక్కో దానిలో 40సీట్లు ఉంటాయని, ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వీరికి 16వ తేదీన ఆర్ట్స్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారు పీజీలో నేరుగా రెండో సంవత్సరం చేరవచ్చన్నారు. వీరికి జగనన్న విద్యా, వసతి దీవెనలకింద ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు.

ఆక్వా.. అమోఘం

- ఆక్వా ఉత్పత్తుల్లో దేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం
- ప్రభుత్వ చర్యలతో పెరిగిన చేపలు, రొయ్యల వినియోగం
- ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు
- ఆకట్టుకున్న స్టాళ్లు.. నేడు, రేపు కూడా నిర్వహణ
- ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలని వక్తల పిలుపు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ వడ్డె రఘురామ్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, తదితరులు



నృత్య ప్రదర్శన



స్టాల్స్‌లో ఉంచిన వంటకాలు



చేపలు, రొయ్యలను పరిశీలిస్తున్న ప్రజలు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఆక్వా ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డె రఘురామ్ అన్నారు. దేశం మొత్తం మీద రూ. 40 వేల కోట్ల ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు ఉంటే అందులో రాష్ట్రం వాటా రూ.30 వేల కోట్లు ఉందన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో కోస్తాంధ్ర జిల్లాలకే పరిమితమైన ఆక్వా ఉత్పత్తుల వినియోగం రాయలసీమ జిల్లాల్లోనూ పెరుగుతోందన్నారు. రాయలసీమ స్థాయిలో కర్నూలులోని రావూరి గార్డెన్‌లో శుక్రవారం ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వడ్డె రఘురామ్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ రకాల స్టాళ్లు ఆకట్టుకున్నాయి. రకరకాల చేపలు, రొయ్యలు, పీతలతో ఏర్పాటు చేసిన మ్యూజియం అలరించింది. శని, ఆదివారాల్లో కూడా ఫుడ్ ఫెస్టివల్ జరగనుంది.

➤ జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రం ఆక్వా రంగం అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. మొదటిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రంగంపై దృష్టి సారించి అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. 'ఫిష్ ఆంధ్ర'తో అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ఆరోగ్యకరమైన చేపలు, రొయ్యలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు.

➤ మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో జిల్లాలో చేపలు, రొయ్యల వినియోగం గణనీయంగా పెరుగుతోందన్నారు. కోస్తాంధ్ర జిల్లాలకు పరిమితమైన సముద్రపు చేపలు, రొయ్యలను రాయలసీమ వాసులు కూడా అందుబాటులోకి తెచ్చారన్నారు.

➤ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆక్వా ఉత్పత్తులు పెంచడంతో పాటు ఎగుమతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. చేపలు, రొయ్యలు ఆరోగ్యకరమైనవని, మాంసాహారులు వీటిని ఆహారంగా తీసుకోవాలని సూచించారు.

➤ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ... ఆక్వారంగంలో ప్రభుత్వం సరికొత్త సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఫిష్ ఆంధ్రకింద ఏర్పాటు చేస్తున్న యూనిట్లకు ప్రభుత్వం 40 నుంచి 60 శాతం వరకు సబ్సిడీ ఇస్తోందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఏఎఫ్ చైర్మన్ అనిల్ బాబు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, కర్నూలు డీడీ శ్యామల, నంద్యాల జిల్లా మత్స్యశాఖ అధికారి రాఘవరెడ్డి, వైఎస్‌ఆర్ జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగాచారి, అనంతపురం, సత్యసాయి జిల్లాల అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత, భూమి ఆర్గానిక్(నాలెడ్జ్ పాట్నర్) ఎండీ రఘురామ్, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యానికి మేలు

ప్రభుత్వం వినూత్నంగా ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌ను నిర్వహించడం హర్షణీయం. చేపలు, రొయ్యలతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు ఇవి బాగా ఉపయోగపడతాయి.

– భారతి, లక్ష్మీనగర్, కర్నూలు



చాలా రుచిగా ఉన్నాయి

కర్నూలులో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం శుభ పరిణామం. ఇందులోకి ఉచితంగా ప్రవేశించే ఏర్పాటు చేయడం అభినందనీయం. చేపలు, రొయ్యల్లో ఇన్ని రకాలు ఉండటం నిజంగా ఆశ్చర్యకరమే! ఫుడ్ ఫెస్టివల్‌లో రొయ్యలు, చేపల స్నాక్స్ తిన్నాం. చాలా రుచిగా ఉన్నాయి.

– నరసింహారెడ్డి, చంద్రిక దంపతులు, చౌరస్తా, కర్నూలు

రాబోయే ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్



వీడియో కాన్ఫరెన్స్‌లోమాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): రాబోయే సాధారణ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనాకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ.. జిల్లాలో 233 మంది సెక్టోరల్ ఆఫీసర్లను రెండు రోజుల్లోగా నియమిస్తామన్నారు. మైక్రో అబ్జర్వర్లు, పోలింగ్ ఆఫీసర్ల విధుల నిర్వహణకు అవసరమైన అధికారులు ఉన్నట్లు చెప్పారు. పోలింగ్ నిర్వహణ కోసం డిస్పాచ్, రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే రాయలసీమ యూనివర్సిటీలో భవనాలను పరిశీలించినట్లు చెప్పారు. పాణ్యం నియోజకవర్గం కొంత భాగం నంద్యాల జిల్లాలోకి వస్తుందని, అయితే ఈఆర్‌ఓగా కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ ఉండడంతో ఏర్పాట్లపై నంద్యాల జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకోనున్నట్లు చెప్పారు. జిల్లాలో మిలిటెంట్ల ప్రభావం లేదని ఆమె రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వివరించారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికలకు 3,130 మంది బందోబస్తు సిబ్బంది అవసరం అవుతారని గుర్తించినట్లు చెప్పారు. ఇందులో 2,260 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, మిగిలిన వారిని కర్ణాటక రాష్ట్రం నుంచి తెప్పించుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 400 వాహనాలు అవసరం అవుతాయని చెప్పారు. జిల్లాలో ఆయుధ లైసెన్స్ కలిగిన వారు 631 మంది ఉన్నారని, ఇందులో 598 మంది డిపాజిట్ చేసినట్లు చెప్పారు. 2019 ఎన్నికల్లో సుమారు రూ. 1.22 కోట్ల నగదుతోపాటు భారీగా మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. కర్ణాటక బార్డర్‌లో 13, తెలంగాణ బార్డర్లో రెండు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో మల్లికార్జునుడు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో నేడు, రేపు ప్రత్యేక సదస్సులు

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో శనివారం, ఆదివారం ప్రత్యేక అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 19,71,325 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో పురుషులు 9,78,663 మంది, మహిళలు 9,92,356 మంది, ఇతరులు 306 మంది ఉన్నారని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

విభిన్న ప్రతిభావంతులు ఓటరుగా నమోదు చేసుకోండి

కర్నూలు(అర్బన్): జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన విభిన్న ప్రతిభావంతులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తమ పరిధిలోని సచివాలయం, ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకొని రానున్న ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

నాణ్యతలేని సరుకులు విక్రయిస్తే చర్యలు

- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ ఎస్పీ పూజిత



మాట్లాడుతున్న పూజిత

ఆదోనిఅర్బన్: నాణ్యతలేని సరుకులు విక్రయించే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ ఎస్పీ పూజిత హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ద్వారకా ఫంక్షన్ హాల్‌లో దుకాణదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సరుకులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మరాదన్నారు. అనుమతిలేని సీడ్స్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే వారిపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐలు సునీల్‌కుమార్, నాగరాజు, ఆయా సంఘాల అసోసియేషన్ నాయకులు రాజుస్వామి, బసవన్నగౌడ్, అశోకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభయమిస్తూ.. ఆసరా అందిస్తూ!

- అరుదైన వ్యాధి బాధితులకు ప్రత్యేక పింఛన్
- వ్యాధిని బట్టి నెలకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు అందజేత
- జిల్లాలో 1,349 మంది లబ్ధిదారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు

అందరిలా వారు జీవించలేరు. జీవించి ఉన్నంత వరకు వైద్యులు, మందులతో వారికి స్నేహం. అరుదైన వ్యాధులతో వారి జీవితం ఛిన్నాభిన్నం అవుతోంది. ఈ పరిస్థితుల్లో వారికి వైద్యఖర్చులు భారంగా మారడంతో పాటు మనోవేదనతో మరింత కుంగిపోతున్నారు. ఇలాంటి వారి పరిస్థితిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక పింఛన్ ఇస్తూ ఆసరా కల్పిస్తున్నారు. వారి జీవితానికి తోడుగా నిలుస్తున్నారు.



కర్నూలు(హాస్పిటల్): ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే గ్రామస్థాయిలో వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్‌క్లినిక్స్, మండల స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తాలూకా కేంద్రాల్లో సీహెచ్‌సీలు, పట్టణాల్లోని మురికివాడల్లో యూపీహెచ్‌సీలు, జిల్లా కేంద్రంలో బోధనా సుపత్రులతో వైద్యరంగాన్ని బలోపేతం చేశారు. క్షతగాత్రులు, గర్భవతులు ఆసుపత్రికి వెళ్లి వచ్చేలా 108 వాహనాలు, బాలింతను ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు 102 వాహనాలు, ఊళ్లోకే వైద్యం అందించేందుకు వచ్చే ఫ్యామిలీ ఫిజీషియన్, 104 వాహనాలతో గతంలో ఏ ప్రభుత్వం చేయలేనని సంస్కరణలు తీసుకొచ్చారు. ప్రస్తుతమున్న ఆసుపత్రులను సైతం ఆధునీకరించి, వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేస్తూ, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీకి మరిన్ని హంగులు అద్ది ఇంకా మెరుగ్గా తీర్చిదిద్దారు. ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక వ్యాధులున్న వారికి ప్రతి నెలా రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వైఎస్‌ఆర్ హెల్త్ పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నారు.

మెడికల్ బోర్డులో వ్యాధి నిర్ధారణ

వైఎస్‌ఆర్ హెల్త్ పెన్షన్ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు అమలు చేస్తోంది. ఈ మేరకు లబ్ధిదారులు ముందుగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మెడికల్ బోర్డులో దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి వారు ఒక నిర్ణీత తేదీలో రావాలని సూచిస్తారు. ఆ రోజున వచ్చిన వారిని పరీక్షించి వ్యాధినిర్ధారణ చేసి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు. లబ్ధిదారులు అక్కడ ఇచ్చిన పత్రంతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకం తదితర వివరాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని వైఎస్‌ఆర్ హెల్త్ పెన్షన్ విభాగంలో దరఖాస్తు చేయాలి. ఇలా వచ్చిన దరఖాస్తులను అక్కడి ఉద్యోగులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు అప్‌లోడ్ చేస్తారు. అక్కడి నుంచి సెర్ప్‌కు వివరాలు పంపిస్తారు. పింఛన్ మంజూరైన విషయాన్ని లబ్ధిదారుల నివాస పరిధిలోని సచివాలయానికి వెళ్తుంది. సచివాలయంలోని వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తారు.

వ్యాధిని బట్టి ఆర్థిక సాయం

జిల్లాలో వైఎస్‌ఆర్ హెల్త్ పెన్షన్ పథకం లబ్ధిదారులకు వ్యాధిని బట్టి ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని అందజేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 9 వ్యాధులకు 1,464 మంది పింఛన్ అందుకుంటున్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు రూ.3వేలు, కిడ్నీ బాధితులు(డయాలసిస్ వారికి), గుండె, కిడ్నీ, కాలేయం మార్పిడి చేయించుకున్న వారికి, కండరాల క్షీణత ఉన్న వారికి, వివిధ ప్రమాదాల్లో మంచానికి పరిమితమైన వారికి, పక్షవాతంతో అంగవైకల్యం వచ్చి కుర్చీకే పరిమితమైన వారికి, రెండు కాళ్లకు బోదకాలు ఉన్న వారికి నెలకు రూ.5వేలు, సికిల్‌సెల్, తలసీమియా, హిమోఫీలియా(2శాతంపైబడి) ఉన్న వారికి నెలకు రూ.10వేలు అందజేస్తున్నారు.

ప్రత్యేక పింఛన్ లబ్ధిదారుల వివరాలు

తలసీమియా	130
సికిల్‌సెల్	16
హిమోఫీలియా	65
బోదకాలు	10
పక్షవాతం	488
మస్క్యులర్ డిస్ట్రోఫి	365
కిడ్నీ వ్యాధులు	69
కుష్టుతో వైకల్యం	281
అవయవ మార్పిడి	40
మొత్తం	1,464

జగనన్న మేలు జన్మలో మరచిపోలేం



మాకు నలుగురు పిల్లలు. సంవత్సరం తర్వాత నా కూతురు మాధవికి తలసీమియా అని బయటపడింది. పెద్దాసుపత్రికి వెళ్లి రక్తం ఎక్కించాలని చెప్పారు. ప్రతిసారీ కర్నూలు వెళ్లి రక్తం ఎక్కించడం, వైద్యపరీక్షలు చేయించడం ఖర్చుతో కూడుకున్నది. ఇలా కొంతకాలం ఇబ్బంది పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక మా పాపకు రూ.10వేలు పింఛన్ ఇస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు వెళ్లి రక్తం ఎక్కించుకుని మంచి వైద్యం ఇప్పిస్తున్నాం. మా పాప ఆరోగ్యంగా ఉంది. జగనన్న సాయాన్ని జన్మలో మరిచిపోలేం.

–సుజాత, గూడూరు, కర్నూలు

అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు



జిల్లాలో వైఎస్‌ఆర్ హెల్త్ పింఛన్‌కు ఇంకా ఎవ్వరైనా అర్హులై ఉంటే వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మానవతాదృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌ను జిల్లాలో అర్హులై ఉండి పొందకుండా ఉండకూడదు. ఈ మేరకు ఆశాలు, ఏఎన్‌ఎంలచే సర్వే చేయిస్తున్నాం. వైఎస్‌ఆర్ హెల్త్ పింఛన్ ద్వారా లబ్ధిదారులకు ఎంతో మేలు చేకూరుతుంది. ప్రభుత్వం ఇచ్చే మొత్తం వారి కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలుస్తోంది.

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

ప్రతి నెలా రూ.10వేల పింఛన్ ఇస్తున్నారు



మా నాన్న పేరు ఖాదర్‌బాషా. నాకు హిమోఫీలియా వ్యాధి ఉందట. ఈ వ్యాధి వల్ల నేను చాలా బాధపడ్డాను. నా ఆరోగ్యం కోసం మా అమ్మానాన్న ఎంతో మంది వైద్యులను కలిసి నాకు చికిత్స చేయించారు. చాలా డబ్బులు ఖర్చు అయ్యాయని అమ్మానాన్న చెప్పారు. ఇప్పుడు నాకు ప్రతి నెలా రూ.10వేల పింఛన్ ఇస్తున్నారు. ఈ డబ్బుతో వైద్యం చేయించుకుంటున్నాను. జగన్ మామయ్య మాకు ఎంతో మేలు చేశారు.

–షేక్ అబుబాకర్ సిద్దిక్, కొత్తపేట, కర్నూలు


వేడివేడిగా..


చేపల ఫ్రై..రుచి చూడండి


పచ్చళ్లు కూడా ఉన్నాయి.. తీసుకోండి


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

చేపలు ఘుమఘుమ..
రొయ్యలు నోరూరా!

రకరకాల చేపలు.. విభిన్న రకాల రొయ్యలు.. వాటితో చేసిన ప్రత్యేక వంటకాలు.. శుక్రవారం కర్నూలు నగరంలోని రావూరి గార్డెన్‌లో ఘుమఘుమలాడాయి. ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌కు వచ్చిన ప్రజల నోరూరించాయి. వేపుళ్లు, పచ్చళ్లతో ఏర్పాటు చేసిన స్టాళ్లు సందడిగా కనిపించాయి. ఫెస్టివల్‌కు వచ్చిన ప్రజలకు చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే లాభాలను అధికారులు వివరించారు. ప్రజాప్రతినిధులు స్టాళ్లను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. బఫే ఫుడ్ కోర్టులో రూ.399కే అన్‌లిమిటెడ్‌గా చేపలు, రొయ్యల వంటకాలను తినే అవకాశాన్ని మత్స్యశాఖ కల్పించింది. –సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు


ఫిష్ బాల్స్ కొనుగోలు చేస్తూ..


ఎండు చేపల స్టాల్..


చేపలు భలే ఉన్నాయి..

ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు

కర్నూలు (రాజ్‌విహార్): పాలస్తీనాపై దాడులు ఆగాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ముస్లిం మత పెద్ద మౌలానా జుబైర్ అహ్మద్ ఖాన్ అన్నారు. ప్రపంచ శాంతి కోసం శుక్రవారం రాత్రి కర్నూలు నగరంలోని ఉమర్ అరబిక్ కాలేజ్ ఆవరణంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు అభివృద్ధి చెందాలంటే శాంతి, సోదర భావం, సహకరించుకునే తత్వం ఉండాలన్నారు. తీవ్రవాదం, ఉగ్రవాదానికి ఇస్లాం మతం పూర్తిగా వ్యతిరేకమని పేర్కొన్నారు. ఎదుటి వారి పట్ల దయ, కరుణ, ప్రేమానురాగాలు చూపించాలని ఖురాన్ బోధిస్తుందన్నారు. హింస, దాడులతో అభివృద్ధి అడుగున పడిపోతుందన్నారు. అనంతరం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలని దువా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు సయ్యద్ జకీర్ అహ్మద్, అబ్దుల్లా హాఫిసాబ్, షావాలి మౌలానా, ముఫ్తి అబ్దుల్ రెహ్మాన్, ఎండీ తౌసిఫ్, అబ్దుల్ ఖుద్దుస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): పెన్షనర్లు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ట్రెజరీ ఉప సంచాలకులు రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం సీ.క్యాంపు సెంటరులోని కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీలో పెన్షనర్స్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎటువంటి సమస్య ఉన్నా తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. పెన్షనర్లకు సబ్ ట్రెజరీల్లో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కర్నూలు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి వివిధ సమస్యలను జిల్లా ట్రెజరీ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో కర్నూలు సబ్ ట్రెజరీ ఏటీవో రఘువీర్, పెన్షనర్ల సంఘం నేతలు విజయ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు సుబ్రమణ్యం, మద్దిలేటిరెడ్డి, యూజీసీ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధి నరసయ్య, ఎస్‌టీటీఓ అంజాద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు

శ్రీశైలం డ్యాంలో 66 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 66.5540 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయ నీటిమట్టం 843 అడుగులకు చేరుకుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు దిగువ ప్రాంతాలకు 8,282 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భజలవిద్యుత్ కేంద్రంలో 1.690 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, నాగార్జునసాగర్‌కు 3,544 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 858 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,320, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కర్నూలు మార్కెట్‌లో రైతులకు రూ.15కే భోజనం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మధ్యాహ్నం రూ.15 కే భోజనం అందిస్తున్నారు. ప్రతి ఏటా జరిగే కార్యక్రమమే అయినందున ఎలాంటి ఆడంబరం లేకుండా ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఒక భోజనానికి మార్కెట్ కమిటీ రూ.20 భరిస్తుంది. రైతులు రూ.15 చెల్లించాల్సి ఉంది. మిగిలిన మొత్తాన్ని ఇస్కాన్ భరిస్తుంది. రోజుకు దాదాపు 400 మంది రైతులకు ప్రయోజనం కలుగుతోంది. రైతులు మార్కెట్‌లోకి సరుకు తీసుకుని ప్రవేశించేటప్పుడే మెయిన్ గేట్‌లో భోజనానికి సంబంధించిన టోకెన్ ఇస్తారు.

ప్రశాంతంగా జాతీయ సాధన పరీక్ష

కర్నూలు కల్చరల్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో జాతీయ సాధన పరీక్ష (సీస్) ప్రశాంతంగా జరిగింది. విద్యార్థుల్లో ఉన్న చదువు సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పరీక్షను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నిర్వహించింది. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ప్రైవేట్ యాజమాన్యాల్లో 718 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 3, 6, 9 తరగతి చదువుచున్న 31,012 మంది విద్యార్థులు పరీక్షను రాశారు. జిల్లా విద్యాశాఖాధికారి వి.రంగారెడ్డి పరీక్ష కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

- జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

దేవనకొండ: జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయొద్దని, ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం ఉదయం దేవనకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జనగన్నకు చెబుదాం–స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సంతృప్తిస్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎక్కువ శాతం రెవెన్యూ సమస్యలు వచ్చాయని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాలకు వీఆర్వోలు కూడా వచ్చేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని ఇన్‌చార్జి సీపీఓని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి 130 మంది అర్జీలు వచ్చాయి. పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి, దేవనకొండ తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఎంపీడీఓ గౌరీదేవి, ఎంఈఓ తిమ్మారెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

గోనెగండ్లలో పట్టపగలే చోరీ

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అచ్చుకట్ల వీధి షాదిఖాన సమీపంలో దేశాయ్ రహమతుల్లా నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి భార్య షాహిదాబీతో కలసి కూలీ పనులకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దొంగలు సాయంత్రం ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నగలను అపహరించారు. శబ్దం రావడంతో చుట్టు పక్కల వారు గమనించి, దొంగలు ఉన్నట్లు గుర్తించి, పట్టుకునేందుకు యత్నించగా పారిపోయారు. కూలీ పనుల అనంతరం ఇంటికి వచ్చిన రహమతుల్లా, షాహిదాబీ బీరువాను పరిశీలించగా అందులో ఉన్న రూ.3లక్షల నగదు, 3 తులాల బంగారు, 20 తులాల వెండి చోరీ జరిగినట్లు తెలుసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.


బీరువాను పగులగొట్టిన దృశ్యం

గ్రూప్–1 అధికారులకు ఇంట్రడక్షన్ ట్రైనింగ్

శ్రీశైలంప్రాజెక్ట్: పదమూడు మంది గ్రూప్–1 ట్రైనీ అధికారులకు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఇంట్రడక్షన్ ట్రైనింగ్ ఇచ్చారు. చెంచు గిరిజనుల జీవనశైలి, వారికి అందుతున్న ప్రభుత్వం ఫలాలను పీఓ డాక్టర్.బి.రవీంద్రారెడ్డి వివరించారు. వారి వెంట ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ బి.సి ధనుంజయ తదితరులు ఉన్నారు.


చెంచుల స్థితిగతులను వివరిస్తున్న అధికారులు

వ్యభిచార కూపంలోకి విద్యార్థినులు?

- అదుపులోకి తీసుకున్న ఆదోని పోలీసులు

ఆదోనిఅర్బన్: కొంతమంది కళాశాల విద్యార్థినులు వ్యభిచార కూపంలోకి దిగి, ఆదోని పోలీసులకు పట్టుబడినట్లు తెలుస్తోంది. పట్టణంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని త్రీటౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఎనిమిది మంది విటులు, ఇద్దరు నిర్వాహకులు, కొంతమంది కాలేజీ విద్యార్థినులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు నిర్వాహకులను విచారించగా కర్నూలులో కూడా సెక్స్‌రాకెట్ నిర్వహిస్తున్నట్లు తెలపడంతో అక్కడ కూడా దాడులు చేసి మరికొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కలకత్తా, బెంగళూరు, ధర్మవరం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి అమ్మాయిలను పిలిపించి సెక్స్ రాకెట్ నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై త్రీటౌన్ సీఐ నరసింహరాజు మాట్లాడుతూ.. విచారణ జరుపుతున్నామని, శనివారం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలియజేశారు.



ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!

గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధ పడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవ్యస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి.



మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటు వ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.

● **తగినంత నిద్ర**

నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● **ఫ్లూ టీకాలు**

ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.



● **పరిశుభ్రతను పాటించడం**

ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● **తగినంత దూరం పాటించడం**

తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించ దాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్ని రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.


హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్ళలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్ళను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్ట్రరాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1993)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ' సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ –** ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ.** ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ–** ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు


హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.